సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 9 । అక్టోబర్ । 2025



రత్నగిరిపై 'కార్తిక' ఏర్పాట్లు

కార్తికమాసంలో సత్యదేవుని భక్తుల కోసం ఏర్పాట్లు చేయాలని బుధవారం రత్నగిరిపై జరిగిన దేవస్థానం, ప్రభుత్వ శాఖల అధికారుల సమావేశంలో నిర్ణయించారు.


8లో



వరాల వెంకన్నకు బ్రహ్మోత్సవం

శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం వాడపల్లిలో స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 3,54,028 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టాలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.80 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

ఆఫ్రికా నత్తల నిర్మూలనకు చర్యలు

కలెక్టర్ కీర్తి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కీర్తి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో నల్లజర్ల, కోరుకొండ, సీతానగరం, తాళ్లపూడి, అనపర్తి, రాజానగరం మండలాల్లో సుమారు 176 హెక్టార్లలో ఉద్యాన పంటలపై ఆఫ్రికా నత్తల ప్రభావం ఉన్నట్లు గుర్తించామని కలెక్టర్ కీర్తి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉద్యానశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్మ, బొప్పాయి, కూరగాయల పంటల్లో ఈ నత్తలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. కానీ పంటల ఉత్పత్తి మీద ఇప్పటి వరకు ఈ నత్తల ప్రభావం ఏమి లేదన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నత్తల నిర్మూలనకు వివిధ పద్ధతులపై ప్రదర్శనలతో కూడిన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నత్తలను చేతితో సేకరించి ఉప్పు ద్రావణంలో వేయడం, కాపర్ సల్ఫేట్, ఫెరస్ సల్ఫేట్ ద్రావణాలను పిచికారీ చేయడం, మెటా డీఎస్ మందును పొలాల్లో వేయడం వంటి చర్యల ద్వారా సమర్థవంతంగా నిర్మూలించవచ్చని తెలిపారు. ఉప్పు ద్రావణంలో ముంచిన గన్నీ బ్యాగులను పొలాల గట్లపై ఉంచితే, నత్తల వ్యాప్తి ఇతర పొలాలకు చేరకుండా అడ్డుకోవచ్చని వివరించారు. జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి 1,32,101 ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తయిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 6,000 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ విధానం ద్వారా పంటలను ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటివరకు 3,573 మంది రైతులు 4,246 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మల్లికార్జునరావు, ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గేష్, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.



ఘటనా స్థలిలో చెలరేగుతున్న మంటలు



భీతావహంగా ఘటనా స్థలి

బతుకులు చితికి..

చీకటి వెలుగుల రంగేళీ.. జీవితమే ఒక దీపావళి.. కానీ ఈ దీపావళి వారి జీవితాల్లో చీకట్లు నింపింది. మిరుమిట్లు గొలుపుతూ ఉవ్వెత్తున ఎగసే చిచ్చుబుడ్డి వెలుగులు వారి జీవితాల్లో చిచ్చుపెట్టాయి. ఎవరికి ఎవరూ కాకుండా చేశాయి. మరో పది రోజుల్లో దీపావళి వస్తుంది. ఇంటిల్లిపాదీ ఈ పండగకు ఏ లోటూ లేకుండా బాణసంచా కాల్చాలి.. కొత్త దుస్తులు వేసుకోవాలి.. ఇలా ఎన్నో ఆశలతో ఆ కూలీలు బాణసంచా తయారీలో నిమగ్నమయ్యారు. ఇంతలో రాజుకున్న చిన్న నిప్పురవ్వ పేదల ఇంట పెను విషాదాన్ని నింపి వారి కుటుంబాలను అంధకారమయం చేసింది.



రోదిస్తున్న కుడుపూడి జ్యోతి కుమారుడు దుర్గాప్రసాద్

మృతులు, క్షతగాత్రుల వివరాలు

మృతులు

1. వెలుగుబంట్ల సత్యనారాయణ (65), బాణసంచా తయారీ దుకాణం యజమాని, కొమరిపాలెం, బిక్కవోలు మండలం
2. పాకా అరుణ(35), సోమేశ్వరం, రాయవరం మండలం
3. చిట్టూరి శ్యామల(35), అనపర్తి
4. పెంకే శేషారత్నం(40), అనపర్తి సావరం
5. కుడుపూడి జ్యోతి(38), అనపర్తి సావరం
6. కె.సదానందం (52), ఒడిశా వాసి
7. పొట్నూరి వెంకటరమణ (55), కొమరిపాలెం, బిక్కవోలు మండలం
8. వాసంశెట్టి విజయలక్ష్మి (51), సోమేశ్వరం, రాయవరం మండలం

క్షతగాత్రులు

1. చిట్టూరి యామిని, అనపర్తి
2. లింగం వెంకట కృష్ణ, వేంద్ర, పెదపూడి మండలం



ప్రమాదం స్థలి నుంచి క్షతగాత్రుడిని తీసుకువెళ్తున్న స్థానికులు

- కూలీల జీవితాల్లో విషాద దీపావళి
- రాయవరం మండలంలో ఘటన
- ఎనిమిది మంది మృత్యువాత
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మరుభూమిలా మారిన తయారీ కేంద్రం
- పేలుడు ధాటికి ఎగిరి పడిన శరీరాలు
- యజమాని సైతం మృత్యువాత

సాక్షి, అమలాపురం/రాయవరం/అనపర్తి/బిక్కవోలు: చుట్టూ పచ్చని పొలాలు.. సమీపిస్తున్న దీపావళి.. పండగ నాడు జనం కళ్లల్లో ఆనంద వెలుగులు చూడాలని అహోరాత్రాలు కష్టపడుతున్న బాణసంచా తయారీ కార్మికులు. అప్పుడప్పుడూ వచ్చి పోయే కొనుగోలుదారుల సందడి. అప్పటి వరకు నిశ్శబ్దంగా ఉన్న ఆ ప్రాంతంలో ఒక్క సారిగా పేలుడు శబ్దం. చిచ్చుబుడ్డి తయారు చేస్తున్న సమయంలో రాజుకున్న నిప్పురవ్వలు కొద్ది క్షణాలలోనే ఆ ప్రాంతాన్ని భస్మం చేసేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో పెను విస్ఫోటం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో కాకినాడ జీజీహెచ్‌లో వాసంశెట్టి విజయలక్ష్మి, కాకినాడ ట్రస్ట్ ఆస్పత్రిలో పొట్నూరి వెంకటరమణ చికిత్స పొందుతూ మృతి చెందారు. పేలుడు ధాటికి కార్మికులు పది నుంచి ఇరవై అడుగులు దూరం ఎగిరిపడ్డారు. మరి కొందరు కార్మికులు మంటల్లో చిక్కుకుని నీటితో ఆర్పుకొనేందుకు నాలుగువైపులా పరుగులు తీశారు. ఈ ఘటనతో తయారీ కేంద్రం మంటలకు ఆహుతై మరుభూమిని తలపించింది. ప్రమాదం బారిన పడిన వారిని రక్షించేందుకు వెళ్లిన వారికి అక్కడి దృశ్యాలు చూసి ఒళ్లు గగుర్పొడిచింది. ప్రమాద ధాటికి కొంతమంది కార్మికులు ఎగిరి పక్కనే ఉన్న పంట పొలాల్లో పడ్డారు. మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. చేతికి ఉన్న గాజులు, కాళ్లకు ఉన్న మట్టెల ఆధారంగా మాత్రమే పురుషులు, స్త్రీలుగా గుర్తించారు. ఒంటిపై ఉన్న ఆభరణాలు, చేతికి ఉన్న ఉంగరాల ఆధారంగా తయారీ కేంద్రం యజమానిని గుర్తించారు. మృతుల కుటుంబీకులు చెప్పిన ఆనవాళ్లను బట్టి పోలీసులు కొందరిని గుర్తించారు.

శుభకార్యం ప్రాణాలు నిలిపింది

పేలుడు ఘటనలో గ్రామానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడడంతో అనపర్తి సావరం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ గ్రామం నుంచి ప్రతిరోజు సుమారు 15 నుంచి 20 మంది మహిళలు బాణసంచా దుకాణంలో పని చేసేందుకు వెళ్తుంటారు. స్థానికంగా శుభకార్యం ఉండడం, రాబోయే దీపావళికి ఇల్లు శుభ్రం చేసుకునే పని ఉందని చాలామంది పనికి వెళ్లకపోవడంతో వారు మృత్యువు నుంచి తప్పించుకున్నారు. రోజూ తమతో పాటు పనికి వచ్చే వారిలో కొందరు మృతి చెందారని తెలిసి వారు కన్నీరుమున్నీరయ్యారు.

ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు

అసలు తన భార్య బతికుందా.. లేదా.. అనేది తెలియడం లేదని రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన కూలీ పాకా సుబ్బారావు రోదిస్తున్నాడు. మధ్యాహ్నం భోజన సమయంలో 12.02 గంటలకు తన భార్య అరుణకు ఫోన్ చేశానని, ఆ తర్వాత 12.30 గంటలకు ప్రమాదం జరిగినట్టు తెలిసిందని, ఇంతలోనే అంత ఘోరం జరుగుతుందనుకోలేదని బావురుమన్నాడు.

విషాదంలో కుటుంబ సభ్యులు

యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి మృతితో కుటుంబం విషాదంలో కూరుకుపోయింది. ఎవరూ ఏమీ మాట్లాడలేని పరిస్థితి ఇంటి వద్ద నెలకొంది. ప్రమాద స్థలికి చిన్న కుమారుడు చిట్టిబాబు చేరుకుని గుండెలు పగిలే రోదించాడు.

ఆలనాపాలనా చూసేవారెవరు?



రోదిస్తున్న పెంకే శేషారత్నం అత్తమామలు, తల్లిదండ్రులు



విషణ్ణ వదనంతో శేషరత్నం పెద్ద కుమారుడు కార్తిక్

పెంకే శేషారత్నంకు భర్త సూరిబాబు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కార్తిక్ అనపర్తిలో దుకాణంలో పని చేస్తుండగా, సుబ్రహ్మణ్యం 9వ తరగతి చదువుతున్నాడు. భర్త సూరిబాబు కార్పెంటర్‌గా పని చేస్తున్నారు. అనారోగ్యంతో ఒకరోజు పని చేస్తే రెండు రోజులు ఇంటి వద్దే ఉంటాడు. శేషారత్నం సంపాదిస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటోంది. తల్లి మృతి చెందిందని తెలిసి బేలగా చూస్తున్న చిన్నారులు స్థానికులకు కంట తడిపెట్టిస్తున్నారు. తమ చిన్నారుల పరిస్థితి ఏమిటని తండ్రి సూరిబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మా జీవన 'జ్యోతి' ఆరిపోయింది



రోదిస్తున్న వృద్ధురాలైన జ్యోతి తల్లి లక్ష్మి

కుడిపూడి జ్యోతి కుటుంబ పరిస్థితి చాలా దయనీయం. కుమార్తె, కుమారుడు, వయసు పైబడిన తల్లి లక్ష్మి ఆమెపై ఆధారపడి జీవిస్తున్నారు. కుమార్తెకు ఇది వరకే వివాహం చేయగా, కుమారుడుకి ఇటీవలే వివాహమైంది. నాలుగు నెలల క్రితం భర్త సత్యనారాయణ మృతి చెందాడు. దీంతో వారి భారం జ్యోతిపై పడింది. ఆమె అనుకోకుండా ఈ ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబానికి దిక్కులేకుండా పోయిందని, అనారోగ్యంతో ఉన్న తనను ముందు రోజు ఆస్పత్రికి తీసుకుని వెళ్లి రూ.రెండు వేలు ఖర్చు పెట్టిందని గుండెలు పగేలా రోదిస్తోంది.

పిల్లల చదువు కోసం పనికి వెళ్లి..



ఇంటి వద్ద రోదిస్తున్న చిట్టూరి శ్యామల బంధువులు

నిరుపేద కుటుంబానికి చెందిన చిట్టూరి శ్యామలకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతి వార్త విన్న వృద్ధురాలైన ఆమె అత్తగారిని ఓదార్చడం ఎవరి వల్లా కావడం లేదు. పిల్లలు ఇద్దరూ ఇంకా చదువుకుంటున్నారని వారికి ఖర్చులకు ఉంటాయని పనికి వెళ్లిందని, ఇలా మృత్యువాత పడుతుందని ఊహించలేదని రోదిస్తున్నారు. అత్తగారు గుండెలు పగిలేలా రోదిస్తుంటే ఓదార్చేందుకు మాటలు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు.



ఘటన స్థలంలో చెలరేగిన మంటలతో దట్టంగా వ్యాపించిన పాగ

లోపం ఎక్కడుంది?

- అయోమయంలో అధికారులు
- పనికి వెళ్లిన కూలీలెందరో?
- మృతుల గుర్తింపులో జాప్యం

రాయవరం: మండల కేంద్రం రాయవరంలో బుధవారం జరిగిన ప్రమాద ఘటన పలు లోపాలను ఎత్తి చూపుతోంది. ఈ ఘటనలో తప్పెవరిది అనే ప్రశ్నకు సమాధానం లేదు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయంలో పలు ఊహాగానాలున్నాయి. దర్యాప్తు పూర్తయితే గానీ ప్రమాదానికి కారణం చెప్పలేని పరిస్థితి నెలకొంది. చిచ్చుబుడ్డిని దట్టించే సమయంలో ప్రమాదం జరిగిందా.. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా అనేది నిర్ధారించలేకపోతున్నారు.

భీతావహ పరిస్థితి

ప్రమాద స్థలం మొత్తం మరుభూమిని తలపించింది. ప్రమాదం జరిగిన తర్వాత 7.30 గంటల సమయానికి కూడా ఆరో మృతదేహాన్ని గుర్తించలేక పోయారంటే అసలు పనికి ఎంతమంది ఎక్కడి నుంచి వెళ్తున్నారనేది పక్కాగా నమోదు చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది.

నివ్వెరపోయిన అధికారులు, ప్రజలు

ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక అధికారులు కూడా సిబ్బందితో వచ్చి ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఘటనా స్థలిలో మృతదేహాలు ఉన్న తీరును చూసి అధికారులకు నోట మాట రాలేదు. అక్కడి పరిస్థితిని చూసిన వారు చలించిపోయారు.

ఘటనా స్థలిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఏఎస్పీ ఎస్‌బీఎం మురళీకృష్ణ, రామచంద్రపురం ఆర్డీవో అఖిల, డీఎస్పీ బి.రఘువీర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం తదితరులు సందర్శించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు.



ఘటన వివరాలను కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వివరిస్తున్న రామచంద్రపురం ఆర్డీవో అఖిల



ఘటనా స్థలికి వచ్చి ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర హోం మంత్రి అనిత



జీజీహెచ్‌లో బాణసంచా బాధితుడికి కొనసాగుతున్న చికిత్స

బాణసంచా తయారీలో మూడు తరాలుగా..



అప్పటి డీజీపీ కౌముది నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న సత్తిబాబు (ఫైల్)

రాయవరం: గ్రామం సమీపంలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రాన్ని మూడు తరాలుగా ఒకే కుటుంబం నిర్వహిస్తోంది. రాష్ట్రంలో మొదటిసారిగా ఇక్కడి నుంచే బాణసంచా తయారీ కుటీర పరిశ్రమగా ప్రారంభమైంది. స్వాతంత్ర్యానికి పూర్వమే వెలుగుబంట్ల వీరన్న బాణసంచా తయారీని ప్రారంభించినప్పటికీ వారి కుమారులు తాత నారాయణమూర్తి, రామకృష్ణల హయాంలోనే అభివృద్ధి చెందింది. తాత నారాయణమూర్తి కుమారుడు వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు), రామకృష్ణ కుమారుడు కోటిబాబులు వేర్వేరుగా వ్యాపారాన్ని సాగించారు. కోటిబాబు మరణించే వరకు ఈ వృత్తిని కొనసాగించగా, వారసులు వృత్తికి స్వస్తి పలికారు. ఇదిలా ఉంటే సత్యనారాయణమూర్తి మాత్రం బాణసంచా తయారీని కొనసాగిస్తున్నారు. దీపావళి పర్వదినానికే కాకుండా వివాహాది శుభకార్యాలకు, గ్రామాల్లో జరిగే అమ్మవారి జాతర్లు, రాజకీయ పార్టీల ఊరేగింపులు, ఉత్సవాలకు బాణసంచా తయారీ చేస్తున్నారు. 1952లో మద్రాస్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశం, 1978లో బెంగళూరులో జరిగిన జాతీయ క్రీడలకు, 1983లో ఎన్టీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారానికి, 1983, 1999లలో ఫిలిం ఫెస్టివల్స్‌కు, పలు చలన చిత్రాల శత దినోత్సవాలకు వెలుగుబంట్ల సోదరులు తయారుచేసిన బాణసంచా కాల్చారు. వాటి తయారీలో ప్రత్యేక స్థానాన్ని సాధించి నిశిరాత్రిలో వెలుగుపూలు నింపిన వెలుగుబంట్ల సత్తిబాబు అదే బాణసంచా ప్రమాదానికి గురికావడాన్ని పలువురు జీర్ణించుకోలేకపోతున్నారు. వివాద రహితుడు, సౌమ్యుడిగా పేరున్న సత్తిబాబు మృతితో ఆయన అభిమానులు, మిత్రులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

ఉలిక్కిపడ్డ తూర్పు

- చిచ్చురేపుతోన్న చిచ్చుబుడ్డి
- వాకతిప్ప నుంచి రాయవరం వరకు పలు దుర్ఘటనలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఒక్కసారిగా 'తూర్పు' ఉలిక్కిపడింది. అక్టోబర్ నెల వచ్చిందంటే చాలు దీపావళి ముంగిట తీవ్ర విషాద ఛాయలు అలుముకుంటున్నాయి .2014 నుంచి ఇంతవరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సంభవించిన బాణసంచా ప్రమాద ఘటనలు చూసుకుంటే దాదాపు అన్నీ అక్టోబర్ నెలలోనే నమోదయ్యాయి. వీటిలో అత్యధికం చిచ్చుబుడ్డిలు కూరుతుండగా సంభవించిన ప్రమాదాలే కావడం గమనార్హం. పెను ప్రమాదం జరిగిన ఒకటి, రెండు రోజులు అగ్నిమాపక అధికారులు హడావుడి చేయడం ఆనక గాలికొదిలేయడం పరిపాటి. జనం కూడా ఆ రెండు రోజులు గుర్తుంచుకుని జాగ్రత్త పడి ఆనక మరచిపోతున్నారు. తాజాగా రాయవరంలో బుధవారం సంభవించిన దుర్ఘటనలో పొట్టకూటి కోసం వెళ్లి రెక్కాడితే గాని డొక్కాడని ఆరుగురు బతుకులు బుగ్గిపాలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో సంభవించిన బాణసంచా విస్ఫోటం పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ యజమాని సహా ఐదుగురి శరీరాలు తునాతునకలై భయోతాత్పాన్ని సృష్టించాయి. బాణసంచా తయారీలో శివకాశీ తరువాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి బాణసంచా తయారీ కేంద్రంగా పేరెన్నికగన్న కొమరిపాలెం ఫైర్‌వర్క్స్‌కు రాయవరంలో ఉన్న తయారీ కేంద్రంలో ఈ ప్రమాదం సంభవించింది.

క్షణాల్లో భస్మీపటలం

బాణసంచా తయారీ కేంద్రంలో చిచ్చుబుడ్డిలు కూరే క్రమంలో ఒత్తిడికి గురై పేలి పక్కనే ఉన్న రాకెట్‌కు నిప్పంటుకుంది. ఆ రాకెట్ వెళ్లి మిగిలిన మందుగుండుపై పడటంతో తయారీ కేంద్రం క్షణాల్లోనే భస్మీ పటలం అయిపోయింది. ప్రమాదానికి విద్యుతాఘాతమే కారణమని ఘటనా స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పుకొచ్చారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ మాత్రం ఈ ఘటనపై లోతైన విచారణ జరుపుతున్నామని ప్రకటించడం గమనార్హం. కాగా, ఘటన జరిగిన సమయంలో మందుగుండు తయారీ కేంద్రంలో 12 మంది కార్మికులు ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక శాఖాధికారులు దీపావళికి ముందుగానే తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేస్తుంటారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తుంటారు. ఇటీవలనే అధికారులు ఈ కేంద్రాన్ని కూడా తనిఖీ చేసి వెళ్లారు. బాణసంచా తయారీలో మూడు తరాల వారసత్వాన్ని అందిపుచ్చుకున్న కొమరిపాలెంకు చెందిన గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో 30 ఏళ్ల క్రితం ఒకసారి ఇటువంటి ప్రమాదమే జరిగింది. ఇన్నేళ్ల తరువాత రెండో ప్రమాదం చోటుచేసుకోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

కునుకులేకుండా చేస్తున్న ప్రమాదాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉప్పాడ కొత్తపల్లి మండలం వాకతిప్ప విస్ఫోటం తరువాత బుధవారం నాటి రాయవరం దుర్ఘటనే అతి పెద్దదిగా చెబుతున్నారు. సరిగ్గా పుష్కర కాలం క్రితం అక్టోబర్ నెల 20న 2014లో మణికంఠ ఫైర్ వర్క్స్‌లో జరిగిన పెను ప్రమాదం 18 మందిని పొట్టన పెట్టుకుంది. లైసెన్సు లేకుండా అనధికారికంగా తయారు చేయడం, తయారు చేసిన మందుగుండు అక్కడే భారీగా నిల్వ చేయడం అంతటి పెను విషాదానికి కారణమైంది. మృతుల కుటుంబాలకు రూ.మూడేసి లక్షల సాయం అందించిన నాటి చంద్రబాబు సర్కార్ బాధితులకని కేటాయించిన భూమిని ఈ రోజుకు కూడా వారికి చూపించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. నాడు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున రూ.50 వేలు అందించారు. 2014లో అక్టోబర్ 28న మండపేట మండలం ఏడిదలో అనధికారికంగా బాణసంచా తయారు చేస్తుండగా ప్రమాదం సంభవించి కల్లి శ్రీనివాసరావు తనయుడు కృష్ణ మృతిచెందాడు. 2019 అక్టోబర్‌లో ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలం వేమవరం బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ప్రమాదం కూడా చిచ్చుబుడ్డిలో మందు కూరుతుండగానే సంభవించడం గమనార్హం. నాటి ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ ఎనిమిది మందికి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స అందించారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు (చంద్రబాబు హయాంలో రూ.3 లక్షలు ఇచ్చారు) పరిహారం అందించడమే కాకుండా క్షతగాత్రులకు రూ.3 లక్షలు అందించారు. 2019 అక్టోబర్‌లో పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం జీ మేడపాడులో బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ప్రమాదంలో ఇద్దరు, కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరో నలుగురు మొత్తం ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం కూడా డిస్కో చిచ్చుబుడ్లు తయారు చేస్తుండగానే సంభవించడం గమనించదగ్గ విషయం. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు నాటి జగన్ ప్రభుత్వం అత్యధికంగా రూ.15 లక్షలు (ఎస్సీ ఆర్థిక సాయం రూ.4 లక్షలు కలిపి) వంతున అందించి బాధిత కుటుంబాలను అక్కున చేర్చుకుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 30న అయినవిల్లి మండలం విలసలో బాణసంచా విక్రయించేందుకు సిద్ధమవుతుండగా మందుగుండు పేలిపోయి దంపతులు కంచర్ల శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి మృత్యువాత పడ్డారు. ఇలా ఏటా జరుగుతున్న ఈ విస్ఫోటాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి.

ముందే హెచ్చరించిన 'సాక్షి'

ప్రాణ సంకటంగా బాణసంచా



ఈ నెల నాలుగో తేదీన 'సాక్షి'లో ప్రచురించిన కథనం

సాక్షి, అమలాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దీపావళి వేళ ప్రమాదాలు చోటు చేసుకోవడం పరిపాటిగా మారింది. అధికారులు సమీక్షలకే పరిమితమవుతున్నారు. దీనిపై 'సాక్షి' దినపత్రిక ముందుగానే హెచ్చరించింది. ఈ నెల ఒకటో తేదీన 'అలక్ష్యంతో అనర్థం', నాలుగో తేదీన 'ప్రాణ సంకటంగా బాణసంచా' శీర్షికలతో కథనాలను ప్రచురించింది. దీపావళి సమయాల్లో గతంలో జరిగిన ప్రమాదాలను ఉటంకిస్తూ.. అధికారులు పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపింది. అయినా జిల్లా యంత్రాంగంలో కదలిక లేదు. తయారీ కేంద్రాన్ని ఇటీవల సందర్శించామని, అన్నీ జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. అయినా ఇంత ప్రమాదం జరగడం స్థానికులను విస్మయ పరుస్తోంది.

క్లుప్తంగా

లక్ష్మీనృసింహుని సన్నిధిలో రోజా


అంతర్వేది ఆలయంలో స్వామివారి చిత్ర పటం అందుకుంటున్న రోజా

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వరుదు కల్యాణి స్వామివారికి పూజలు చేశారు. తొలుత ఆలయం వద్ద వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు పి.రామశేషాచార్యులు, ఎస్‌బీఎం రమేష్ స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి వారికి స్వామివారి చిత్రపటాలను, లడ్డు ప్రసాదాలను అందజేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు పాల్గొన్నారు.

హుండీలో మంగళ సూత్రాలు


మహిషాసుర మర్దిని దేవి ఆలయం హుండీ నగదుతో కనిపించిన మంగళ సూత్రాలు

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక రవణం వీధిలోని మహిషాసుర మర్దినిదేవి ఆలయంలో హుండీని ఆలయ కమిటీ, ఆ వీధి ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం తెరిచి లెక్కించారు. ఈ సమయంలో కరెన్సీ నోట్లు, చిల్లర నాణేలతో పాటు బంగారు మంగళ సూత్రాలు గమనించారు. మొక్కు చెల్లింపులో భాగంగా అజ్ఞాత భక్తురాలు హుండీలో తాళి బొట్టు వేసి ఉంటుందని భావిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యుడు చిక్కం కిట్టు తెలిపారు. దసరా శరన్నవ రాత్ర ఉత్సవాల సమయంలో అమ్మ వారి హుండీలో రూ.82 వేల నగదు వచ్చిందని కమిటీ తెలిపింది.

వరాల వెంకన్నకు బ్రహ్మోత్సవం

- రేపటి నుంచి వాడపల్లి క్షేత్రంలో ప్రారంభం
- రోజుకో ప్రత్యేక అలంకారంలో దర్శనం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

కొత్తపేట: 'ఏడు వారాల వెంకన్న దర్శనం.. ఏడేడు జన్మల పుణ్యఫలం' నానుడితో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం వాడపల్లిలో స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. దేవదాయ, ధర్మదాయ శాఖ, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేశారు. అటు రావులపాలెం, ఇటు బొబ్బర్లంక నుంచి స్వాగత ద్వారాలు, అక్కడి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణలు చేశారు.

1759లో ఆలయ నిర్మాణం

స్వామివారి ఆలయాన్ని పినపోతు గజేంద్రుడు అనే వ్యాపారి 1759వ సంవత్సరంలో నిర్మించారు. ఆయన స్నేహితుడు, ప్రాంతీయ పరిపాలకుడైన పెద్దాపురం మహారాజు రాజా వత్సవాయి తిమ్మ జగపతిరాజు ఈ ఆలయ నిర్వహణకు 275 ఎకారాలను విరాళంగా సమకూర్చారు. దీప ధూప నైవేద్యాల కోసం 110 ఎకరాలు, స్వామి వారి సేవల నిమిత్తం 165 ఎకరాల భూమి సమర్పించారు.

అంతకంతకూ పెరుగుతున్న భక్తజనం..

పెద్ద తిరుపతి, చిన్న తిరుపతి తరువాత అత్యంత భక్తజనాదరణ పొందిన క్షేత్రంగా వాడపల్లి విలసిల్లుతోంది. గౌతమీ-వశిష్ఠ గోదావరుల నడుమ, గౌతమీ నదికి అతి సమీపంలోని ఈ క్షేత్రానికి కొద్ది దూరంలోనే విజ్జేశ్వరం, లొల్ల గ్రామానికి ఆనుకొని ఉండటంతో ఈ గ్రామాన్ని లొల్ల వాడపల్లి, చిన్న వాడపల్లిగా పిలుస్తారు. ఇక్కడ నిత్యం తిరుమల తరహాలో సుప్రభాత, నిత్య కల్యాణ సేవలు నిర్వహిస్తారు. ఏడు శనివారాల పాటు, ఏడు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించి మొక్కుబడులు చెల్లించి, మరో వారం అష్టోత్తర పూజ చేయిస్తే సంకల్పాలు నెరవేరుతాయన్నది భక్తుల నమ్మకం. ఈ ప్రాశస్త్యం మేరకు పదేళ్ల కాలంలో స్వామివారి ఖ్యాతి గణనీయంగా పెరిగి ప్రతి శనివారం సుమారు రూ.55 లక్షలకు పైబడి, నిత్యం రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షలు వరకు ఆదాయం వస్తుండగా, ప్రతి నెలా హుండీల ద్వారా సుమారు రూ 1.35 కోట్లు పైబడి ఆదాయం సమకూరుతోంది. దానితో ఆలయం డిప్యూటీ కమిషనర్ స్థాయికి చేరింది.


వాడపల్లి వెంకటేశ్వరస్వామి క్షేత్రం

వైఎస్సార్ సీపీ హయాం నుంచీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి, దాతల సహకారంతో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అవరణలో గోశాల, భారీ రేకుషెడ్లు, అన్నదాన భవనం నిర్మాణం, వకుళమాత అన్న ప్రసాద భవనం, స్వామి వారి తెప్పోత్సవం నిర్వహణకు కోనేరు ఏర్పాటుకు శ్రీకారం. కాలినడకన వచ్చే భక్తులకు విశ్రాంతి, సామూహిక వివాహాలు, ఉపనయనాలు జరిపేందుకు వీలుగా మూడు అంతస్తుల భవనం నిర్మాణం, స్వామి వారికి శాశ్వత వార్షిక కల్యాణ వేదిక, వాటర్ ప్లాంట్, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటుచేశారు.


వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారు

ప్రత్యేక అలంకారాలు, వాహన సేవలు

స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పదో తేదీన పరావసుదేవి అలంకరణలో శేషవాహనంపైనా, 11న సరస్వతిగా, హంసవాహనంపైనా, 12న కోదండరామునిగా హనుమద్వాహనంపైనా, 13న యోగనారసింహునిగా సింహ వాహనంపైనా, 14న మలయప్పస్వామిగా గరుడునిపైనా, 15న శ్రీకృష్ణునిగా ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి మోహినీదేవిగా చంద్రప్రభవాహనంపై, 16న రాజాధిరాజుగా గజవాహనంపై, 17న కల్కిగా ఉదయం కల్పవృక్షవాహనంపై, రాత్రి అశ్వవాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. 18న స్వామివారికి చక్రస్నానం నిర్వహించనున్నారు.

జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో..

ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పర్యవేక్షణలో దేవాదాయ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఆర్టీసీ అదనపు బస్సులు

ప్రతి శనివారం రావులపాలెం డిపో నుంచి 12 బస్సులు, మిగిలిన రోజుల్లో అదనంగా మూడు బస్సులు చొప్పున, అలాగే ఉమ్మడి జిల్లాలో ఇతర డిపోల నుంచి అదనపు బస్సులు నడుతున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేసినట్టు రావులపాలెం డీఎం వైవీవీఎస్ కుమార్ తెలిపారు.

> **అన్ని ఏర్పాట్లు చేశాం**
>
> 
>
> శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకుంటున్నాం. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేశాం. అందరూ సహకరించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతున్నాం.
>
> – నల్లం సూర్యచక్రధర రావు, ఆలయ ఈఓ, వాడపల్లి

బీసీ కుల గణన చేపట్టాలి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీ కుల గణన చేపట్టాలని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. బీసీ గణన చేపట్టకుండా వారిని ప్రభుత్వం అణగతొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా పార్లమెంట్‌లో తగిన మెజార్టీ లేదని, దేశంలోని అసెంబ్లీలు సగానికి పైగా వ్యతిరేకంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తూ బీసీలకు అన్యాయం చేస్తోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు సామాజిక న్యాయం చేయాలన్న మంచి ప్రయత్నంతో మొదలు పెట్టిన బీసీ కుల గణన కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిచిపోయిందని అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తున్నట్టు చెప్పడం కాదని, ఏ కులానికి ఎంతెంత రిజర్వేషన్లు ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. 1992లో తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాలు చేపట్టిన రిజర్వేషన్ల ప్రక్రియపై సుప్రీం కోర్టు 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండ కూడదన్న ఆంక్షలను విధించిన క్రమంలో దేశ వ్యాప్తంగా బీసీ సంఘాలు వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అప్పటి నుంచి బీసీ రిజర్వేషన్లపై తాము పోరాటాలు చేస్తున్నామని కుడుపూడి స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపూడి కాలువలో వ్యక్తి మృతి

దేవరపల్లి: మండలంలోని బందపురం వద్ద తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువలో గ్రామానికి చెందిన గంటా సత్యనారాయణ (61) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మంగళవారం రాత్రి సత్యనారాయణ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహమణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గ్రామాల్లో స్వచ్ఛ నీటిని అందించాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీనా
- ఏఈఈ, డిప్యూటీ ఎంపీడీఓలకు ముగిసిన మొదటి బ్యాచ్ శిక్షణ

సామర్లకోట: తాగునీటి భద్రతపై మూడు రోజు పాటు నిర్వహించిన శిక్షణతో గ్రామాలల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అవకాశం ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీనా అన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ)లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలోని ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు మూడు రోజుల పాటు జల్ జీవన్ మిషన్‌పై నిర్వహించే మొదటి బ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 11 జిల్లాల నుంచి 402 మంది ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు బ్యాచ్‌ల వారి 17వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. మొదటి బ్యాచ్‌లో 40 మందికి శిక్షణ ముగియగా మూడో బ్యాచ్ శిక్షణ బుధవారం ప్రారంభమైంది. గురువారం రెండో బ్యాచ్ శిక్షణ ముగియనుంది. విశ్రాంత ఎస్ఈలు సత్యనారాయణ చౌదరి, ఉమాశంకర్, పెద్దాపురం డీఈఈలు స్వామి, శ్రీరామ్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు.

రత్నగిరిపై 'కార్తిక' ఏర్పాట్లు


సమావేశంలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు

అన్నవరం: ఈ నెల 22 తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కొనసాగనున్న కార్తికమాసంలో సత్యదేవుని సన్నిధికి విచ్చేసే భక్తుల కోసం ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం రత్నగిరిపై జరిగిన దేవస్థానం, ప్రభుత్వ శాఖల అధికారుల సమావేశంలో నిర్ణయించారు. ప్రకాష్‌సదన్ సత్రంలోని ట్రస్ట్‌బోర్డు సమావేశ హాలులో జరిగిన సమావేశానికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షత వహించారు.

కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు మాట్లాడుతూ నవంబర్ రెండో తేదీన సత్యదేవుని తెప్పోత్సవం, ఐదో తేదీన గిరి ప్రదక్షిణ కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ భక్తులకు సత్యదేవుని దర్శనం సులభంగా జరిగేలా, వ్రతాల నిర్వహణ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ శ్రీహరి బాబు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు దేవస్థానం అధికారులు, గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా పాల్గొన్నారు. కార్తిక మాసోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

- వ్రతాలు, దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలకు అదనంగా కౌంటర్ల ఏర్పాటు
- పర్వదినాలలో పశ్చిమ రాజగోపురం వద్ద రోప్ పార్టీ ఏర్పాటు చేసి బృందాల వారీగా దర్శనానికి భక్తులకు అనుమతి
- రెండో తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి పంపా నదిలో జరిగే తెప్పోత్సవానికి 20 మంది గజ ఈతగాళ్లు, తెప్పకు ఎస్కార్ట్ గా రెండు బోట్లు ఏర్పాటు
- గిరి ప్రదక్షిణ జరిగే ఐదో తేదీన రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాల ఏర్పాటు
- నెల రోజులు చిన్నకార్లు, ఆటోలు మినహా మరే ఇతర పెద్ద వాహనాలను కొండమీదకు అనుమతించరు.
- రత్నగిరి, సత్యగిరి పై సుమారు వేయి కార్లు, మూడు వేల బైకులు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు సిద్ధం
- మెయిన్ క్యాంటీన్ భవనాన్ని డార్మెట్రీ గా చేయాలని నిర్ణయం.
- గిరి ప్రదక్షిణ రోడ్డులో 24 తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు
- బెండపూడి వైపు ఆర్చి నుంచి మండపం సెంటర్ ఆర్చి వరకు రోడ్డుకు మరమ్మతులు
- ముఖ్యమైన దేవస్థానం అధికారులకు 20 వాకీటాకీలు అందించాలని నిర్ణయం. ప్రస్తుతం ఉన్న 20 వాకీటాకీ లకు ఇవి అదనం.
- రత్నగిరిపై అన్నిచోట్లా సీసీ టీవీ కెమెరాలు, పశ్చిమ రాజగోపురం, ఆలయ ప్రాంగణంలో రెండు చోట్ల రెండు సమాచార కేంద్రాలు, పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు
- విజయవాడ, విశాఖపట్నం, జిల్లాలోని ముఖ్య పట్టణాల నుంచి అదనపు ఆర్టీసీ బస్‌లు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

- సంఘటనా స్థలంలో హత్య చేసినట్లు ఆనవాళ్లు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు


గుర్తుతెలియని మృతదేహం

పిఠాపురం: పట్టణ శివారు చిత్రాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద బుధవారం ఒక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎవరో ఒక వ్యక్తి చనిపోయి పడి ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ ఎస్సై మణికుమార్ వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు తెలిపారు.

బండరాయితో మోది..

మృతదేహం లభ్యమైన ప్రాంతంలో ఒక బండ రాయి రక్తపు మరకలతో ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. అక్కడే మద్యం బాటిళ్లు లభ్యం కావడంతో మద్యం సేవించి అనంతరం బండరాయితో కొట్టి చంపి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా కేసు దర్యాప్తు ప్రారంభించారు.

రైళ్ల నుంచి జారిపడి ముగ్గురి మృతి

తుని రూరల్: వేర్వేరు రైళ్ల నుంచి జారిపడి ముగ్గురు వ్యక్తులు మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్సై జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. విశాఖపట్నం నుంచి తుని వైపు వస్తున్న రైలు నుంచి గొడిచర్లవద్ద జారిపడి 45 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. అలాగే కొత్తూరు గ్రామ సమీపంలో పూరి-తిరుపతి రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి (50) మృతి చెందాడన్నారు. ఇద్దరి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాలను తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భద్రపరచినట్టు తెలిపారు. బయ్యవరం- కశింకోట స్టేషన్ల మధ్య ఖుర్దా రోడ్డుకు చెందిన వరుణ్ (23) చెన్నై నుంచి హౌరా వెళ్లే మెయిల్ నుంచి జారి పడి మృతి చెందాడన్నారు. మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశామన్నారు. ఈ సంఘటనలపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీనివాసరావు వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి 8 రోజులు, ఒకరికి 6 రోజులు, ఇద్దరికి 5 రోజుల చొప్పున, ఒకరికి 4 రోజులు, ఇద్దరికి 2 రోజులు చొప్పున, ఇద్దరికి ఒక్కరోజు చొప్పున జైలు శిక్ష విధించగా, 20 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మి కుమారి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో ఈ కేసులు నమోదు చేశారు. బుధవారం కోర్టులో 29 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సొసైటీలకు పశుదాణా సరఫరా

అమలాపురం రూరల్: జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి పీఏసీఎస్‌ల ద్వారా మిశ్రమ దాణాను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశుసంవర్ధ క శాఖ అధికారి ఎస్.వెంకట్రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పీఏసీఎస్ ఉన్నతాధికారులు, కార్యదర్శులు, పశుసంవర్ధక అధికారులతో ఈ మేరకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యంత్రాలతో కోతల వల్ల ఎండు గడ్డి దొరకని పరిస్థితి ఏర్పడిందని, ఈ నేపథ్యంలో తక్కువ ధరలకు పాడి రైతులకు దాణాను అందించే దిశగా ప్యాక్స్ ద్వారా సరసమైన ధరకు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పశుదాణా తయారు చేసే సంస్థలతో మాట్లాడి తక్కువ ధరకు నాణ్యమైన దాణాను అందించేలా ఒప్పందం చేసుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఏడు నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది పీఏసీఎస్‌లకు దాణా సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

మంచి అలవాటుగా తపాలా బిళ్లల సేకరణ



ఫిలాటెలి ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ రామచంద్రరావు

బాలాజీచెరువు (కాకినాడ): సాంకేతికత పెరుగుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ తపాలా బిళ్ల సేకరణ మంచి అలవాటుగా మార్చుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక సినిమా రోడ్డులోని సూర్య కళా మందిరంలో బుధవారం జిల్లా స్థాయి ఫిలాటెలి ఎగ్జిబిషన్ (తపాలా బిళ్లల ప్రదర్శన)' ప్రారంభమైంది. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ఫిలాటెలి అభిరుచి అతి ప్రాచీనమైనదని, తపాలా శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపుల వలన ఈ కళ అజరామరంగా భావితరాలకు అందాలని ఆకాంక్షించారు. అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిలాటెలి), ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ జి.శివనాగరాజు మాట్లాడుతూ ఫిలాటెలి అభిరుచి గల అభిమానులు, ఔత్సాహికులు ఒకే వేదికపై తరచూ ఇలా ప్రదర్శనల ద్వారా ఈ కళకు జీవం పోస్తున్నారని కొనియాడారు. కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ (హెడ్ క్వార్టర్స్) గంటి రామకృష్ణ పి.వి.రమణమూర్తి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ (రెగ్యులర్), సామర్లకోట అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ డి.అనిల్ అంబేడ్కర్ కుమార్ పాల్గొన్నారు.


నిందితుడికి పదేళ్ల జైలు

- రూ.5 వేల జరిమానా

రాజమహేంద్రవరం రూరల్: యాచకురాలిపై లైంగిక దాడి చేసిన కేసులో కోరుకొండ మండలం గుమ్మలూరుకు చెందిన జుత్తుక నాగార్జునకు పదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమండ్రి ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు జడ్జి వై.బెన్నయ్య నాయుడు బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం హుకుంపేట గ్రామానికి చెందిన కరుణ వరహాలక్ష్మి బొమ్మూరు సెంటర్‌లో యాచకం చేసుకుని జీవిస్తోంది. గత ఏడాది సెప్టెంబరు 13వ తేదీ రాత్రి 12 గంటలు నుంచి తెల్లవారు జామున 5 గంటల మధ్య ఆమెను గుర్తు తెలియని వ్యక్తి బొమ్మూరు బస్‌షెల్టర్ వద్ద ఉన్న మెడికల్‌షాపు వద్దకు లాక్కుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం చుట్టుపక్కల వారు ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన బొమ్మూరు సీఐ పి.కాశీవిశ్వనాథం దర్యాప్తుచేసి గత ఏడాది సెప్టెంబరు 19వ తేదీన నిందితుడు నాగరాజును అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ విశ్వేశ్వరరావు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచగా, ఏపీపీ కె.రాధాకృష్ణంరాజు వాదనలతో ముద్దాయిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- భర్తకు తీవ్రగాయాలు


ఆటికే సత్యవతి (ఫైల్)

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుండి వస్తున్న వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని శరభవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆటికే సత్యవతి (58), ఆమె భర్త, మాజీ పంచాయతీ వార్డు సభ్యుడు ఆటికే సత్యనారాయణలు బైక్‌పై టి రాయవరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా స్థానిక పెట్రోల్ బంకు సమీపానికి వచ్చేసరికి తుని వైపు వెళ్తున్న వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో సత్యవతి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సత్యనారాయణకు స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ తరలించారు. సత్యవతికి ముగ్గురు కుమారులున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు


ర్యాలి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో జగన్మోహినీ కేశవ, గోపాలస్వామి, ఉమా కమండలేశ్వర స్వామివారి ఆలయాల హుండీలను ఆరు నెలల 19 రోజుల అనంతరం బుధవారం తెరిచి నగదు లెక్కించారు. ఆయా దేవస్థానాల ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో రావులపాలెం మండలం పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రామకృష్ణ పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కించారు. జగన్మోహినీ కేశవ స్వామి ప్రధాన హుండీల ద్వారా రూ 8.29.515, అన్నదానం హుండీల ద్వారా రూ.3,67,275, విదేశీ యూఎస్ఏ 100 డాలర్ 1, 10 డాలర్లు మూడు, 5 డాలర్లు పది, 1 డాలర్ 59, సింగపూర్ 10 డాలర్లు 1, యూఏఈ 5 దినారం ఒకటి వచ్చినట్టు ఈఓ తెలిపారు. అలాగే ఉమా కమండలేశ్వరస్వామి ఆలయం హుండీల ద్వారా రూ.2,64,918 ఆదాయం సమకూరిందన్నారు.

విద్యార్థిని మృతదేహం లభ్యం


పూజిత మృతదేహం

నిడదవోలు: ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థిని కప్పల పూజిత (17) మృతదేహం బుధవారం మోర్త సరిహద్దు ప్రాంతంలో లభ్యమైంది. 24 గంటల పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. పూజిత మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వేలివెన్ను ఓ ప్రైవేట్ కళాశాలలో పూజిత ఇంటర్ చదువుతోంది. మంగళవారం విద్యార్థులతో కలిసి బస్సులో ఇంటికి బయలుదేరింది. దమ్మెన్ను వంతెన వద్దకు రాగానే తనకు వాంతులు వస్తున్నాయని బస్సు ఆపమని కిందకు దిగింది. పూజిత వెంటనే వంతెన దగ్గర చెప్పులు విడిచిపెట్టి కాలువలో దూకేసింది. దీంతో బస్సు డ్రైవర్, సహచర విద్యార్థులు పెద్దగా అరవడంతో స్థానికులు స్పందించి కాలువలో గాలించారు. ఉండ్రాజవరం ఎస్సై డి.రవికుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలికి చేసుకుని విచారణ చేపట్టారు. ఎన్‌డీఎఫ్ బృందాలు కాలువలో గాలించగా చివరకు పూజిత మృతదేహం లభ్యమైంది. విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఉండ్రాజవరం ఎస్సై డి. రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.